క్లుప్తంగా

రెడ్ల సమస్యల పరిష్కారానికి కృషి

● రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ రీజనల్ కోఆర్డినేటర్‌గా సుబ్బారెడ్డి



ఒంగోలు వన్‌టౌన్: రెడ్ల సమస్యలకు పరిష్కారం దిశగా ప్రత్యేక కృషి చేస్తానని రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ రీజనల్ కోఆర్డినేటర్‌గా సుబ్బారెడ్డి పేర్కొన్నారు. రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ రీజనల్ కోఆర్డినేటర్‌గా డాక్టర్ ముండ్ల వెంకట సుబ్బారెడ్డిని నియమిస్తూ సొసైటీ అధ్యక్షుడు యర్రపురెడ్డి సురేంద్ర రెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ అన్ని రెడ్ల సంఘాలను సమన్వయం చేసుకుని, రెడ్ల ఐక్యతకు, రెడ్ల సమస్యలకు పరిష్కారం దిశగా, నిస్వార్థంగా కృషి చేస్తానన్నారు.

బీసీ హాస్టల్ ఆక్రమణలపై అధికారుల తనిఖీ



బీసీ హాస్టల్ ప్రాంగణాన్ని సందర్శించిన జిల్లా బీసీ సంక్షేమ అధికారి

చీమకుర్తి: చీమకుర్తి నెహ్రూనగర్‌లో ఆక్రమణలకు గురైన బీసీ హాస్టల్ ప్రాంగణాన్ని జిల్లా బీసీ సహాయ సంక్షేమ అధికారి దయాకర్ గురువారం సందర్శించారు. ఆక్రమణలకు గురైనట్లు బీసీ సంక్షేమ సంఘం నాయకుడు బత్తుల మల్లికార్జున స్పందనలో ఫిర్యాదు చేయటంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు దయాకర్ వచ్చారు. హాస్టల్ ప్రాంగణంలో అక్రమ నిర్మాణాలను పరిశీలించి తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. తిరిగి హాస్టల్ భవనాన్ని హాస్టల్ కోసం ఉపయోగించుకునేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. దయాకర్‌తో పాటు ఫిర్యాదిదారుడు, స్థానికులు పాల్గొన్నారు.

రేపు వైఎస్సార్ సీపీ నాయకుల సమావేశం

చీమకుర్తి రూరల్: చీమకుర్తి మండల విస్తృత స్థాయి సమావేశం 'బాబూ ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమంపై ఈ నెల 2వ తేదీ ఉదయం 10 గంటలకు బూచేపల్లి కళ్యాణ మండపంలో నిర్వహిస్తారని మండల పార్టీ అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, పట్టణ పార్టీ అధ్యక్షుడు క్రిష్టిపాటి శేఖర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేరుగు నాగార్జున పాల్గొంటారన్నారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి అధిక సంఖ్యలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల కమిటీ, అనుబంధ విభాగాల నాయకులు, కౌన్సిలర్లు, పట్టణ కమిటీ అనుబంధ విభాగాల నాయకుల పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

జహీరాబాద్ ఎంపీకి అభినందనలు

మద్దిపాడు: రజకుల సమస్యలపై పార్లమెంట్‌లో మాట్లాడిన జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు సురేష్ కుమార్ షెట్కార్‌కు రజక సంక్షేమ కార్యాచరణ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు చెన్నుపల్లి వెంకట రమణ గురువారం కృతజ్ఞతలు తెలిపారు. దేశంలో 17 రాష్ట్రాల్లో రజక కులస్తులను ఎస్సీలుగా ఉండగా మిగిలిన 11 రాష్ట్రాలలో ఓబీసీలుగా ఉన్నారని దీనిపై కేంద్రం వెంటనే స్పందించి వెంటనే ఎస్సీల్లో చేర్చాలని లోక్‌సభ జీరో అవర్‌లో మాట్లాడారన్నారు. రజకుల సమస్యలను లేవనెత్తినందుకు ఆయనకు అభినందనలు తెలుపుతున్నట్లు రాష్ట్ర రజక సంక్షేమ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు చెన్నుపల్లి వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



తాళ్లూరు: మండలంలోని తూర్పుగంగవరంలో పలు ఎరువుల దుకాణాలను ఏవో బి.ప్రసాద్‌రావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డులు పరిశీలించారు. ఖరీఫ్ సీజన్ కావడంతో రైతులు అధికంగా పంటలు పండిస్తున్నారని, అన్ని ఎరువులు రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలని, ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని దుకాణాల యజమానులను హెచ్చరించారు.

ప్రభుత్వ స్థలం పరిశీలన

సింగరాయకొండ: మండల కేంద్రంలోని డ్రైవర్‌పేట సర్వే నంబర్ 686–2 లోని ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతమవుతుందని, కాపాడాలని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆర్ కోటి మాదిగ జేసీకి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కళావతి ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు కళావతికి విజ్ఞప్తి చేశారు. నివేదికను జేసీకి అందజేస్తామని చెప్పారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం..



గోనెపల్లివారిపాలెంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలతో నాగార్జున



పల్లామల్లిలో గ్రామంలో రోశయ్యని పరామర్శిస్తున్న, నాగార్జున

● కార్యకర్తలను పరామర్శించిన నియోజకవర్గ ఇన్‌చార్జి నాగార్జున
● అధైర్య పడొద్దని ధైర్యం నింపిన మేరుగు

చీమకుర్తి రూరల్: వైఎస్సార్ సీపీ కార్యకర్తల కోసం ఎందాకైనా వస్తాం.. ఏమి జరిగినా మేం అండగా ఉంటాం అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున పేర్కొన్నారు. ఇటీవల పొదిలిలో జరిగిన మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి పర్యటనలో గొడవలు జరిగిన క్రమంలో చీమకుర్తి మండలం గోనెపల్లివారిపాలెం గ్రామస్తులు కోనేటి రాజశేఖర్, కోనేటి శివపై కూటమి ప్రభుత్వం కేసు పెట్టి రిమాండుకు పంపించింది. ప్రస్తుతం వారు బెయిలుపై రాగా వారిని నాగార్జున గ్రామానికి మాట్లాడారు. పార్టీ ఎప్పుడూ మీకు అండగా ఉంటుందని.. మేమున్నామని భరోసా నిచ్చారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్తూ బూచేపల్లి కుటుంబం, మేము అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, పులి హరిబాబు, కోటయ్య, చందు, కృష్ణ, సుబ్బరామిరెడ్డి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడికి నివాళులు

మండలంలోని పిడతలపూడి గ్రామంలో మండల వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు మేకల వీరారెడ్డి తండ్రి సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు గోవిందరెడ్డి దశదిన కర్మకు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున గురువారం హాజరై వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ, మండల పార్టీ అధ్యక్షుడు, పట్టణ అధ్యక్షుడు, మండల గ్రీవెన్స్ విభాగం అధ్యక్షుడు కత్తి రమణారెడ్డి, చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, పాటిబండ్ల గంగయ్య, దుంపా చెంచిరెడ్డి, వాకా కోటిరెడ్డి, గోపిరెడ్డి ఒబులరెడ్డి రైతు విభాగం అధ్యక్షుడు చంద్ర, మండల స్టూడెంట్ విభాగం అధ్యక్షుడు సాధినేని వెంకటరావు, శేషారెడ్డి, ఏలూరి సురేష్, కూడలి మాలకొండయ్య, సంతోష్, బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



గోవిందరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాగార్జున, నాయకులు

ఎస్సీ సెల్ అధ్యక్షుడికి పరామర్శ..

మండలంలోని పల్లామల్లి గ్రామంలో మండల పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గండి రోశయ్య ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న అతని గృహానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నల్లపాటి వెంకటేశ్వర్లు, నల్లపాటి బ్రహ్మయ్య, గండి రమేష్, కోటేశ్వరరావు, నల్లూరి చంద్ర, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

లీకుల పేరుతో రోడ్ల తవ్వకం



కట్టర్‌లతో రోడ్డును కట్ చేస్తున్న సిబ్బంది



రోడ్డును కట్ చేయడంతో పైకి వచ్చిన స్లాబ్‌లు

● నిర్లక్ష్యంగా మున్సిపల్ సిబ్బంది
● తరచూ ప్రమాదాలు జరుగుతున్న వైనం

ఒంగోలు వన్‌టౌన్: మున్సిపల్ అధికారుల తీరు వలన వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంచి నీటి పైపులైన్ పేరుతో ఒంగోలు నగరపాలక సంస్థ సిబ్బంది రోడ్డును ఎడాపెడా తవ్వడం.. అనంతరం మరమ్మతులు చేయకుండా వదిలేయడం పరిపాటిగా మారింది. ఒంగోలు నగరంలోని సంతపేట పశువుల హాస్పిటల్ రోడ్డు మీద జులై 22న రోడ్డుపై ఒక వైపు నుంచి మరో వైపుకు పూర్తిగా పైపులైన్ లీకు పేరుతో మిషన్‌తో చిన్నచిన్న ముక్కలుగా కట్ చేశారు. చిన్న సిమెంట్ స్లాబ్‌లు రోడ్డుపైకి లేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రాత్రి సమయంలో ప్రమాదాలు..

రోడ్డును కట్ చేయడంతో రాత్రి సమయంలో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్టీసీ బస్టాండ్ నుంచి రిమ్స్‌కు వెళ్లే ఆటోలు చాలా వరకూ ఈ రోడ్డు మీదుగా మున్సిపల్ హైస్కూల్ మీదుగా నెల్లూరు బస్టాండ్ సెంటర్ నుంచి రిమ్స్‌కు వెళ్తాయి. చీకట్లో కనిపించకపోవడంతో ఓ మహిళ వాహనదారులు రోడ్డు స్లాబ్‌ను ఢీకొట్టి కిందపడటంతో గాయాలయ్యాయి. 9 రోజులు అవుతున్నా మరమ్మతులు ప్రారంభించలేదు. కనీసం రోడ్డు రిపేరులో ఉందని హెచ్చరిక బోర్డను ఏర్పాటు చేయలేదు. మెయిన్ రోడ్డు తర్వాత అత్యధిక రద్దీ ఉండే ఈ రోడ్డుపై అధకారులు వదిలివేయడం మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యానికి పరాకాష్టగా చెప్పుకోవచ్చు. రోడ్డు మరమ్మతులు పూర్తి చేయాలని స్థానికులు అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

మోసం చేయడం చంద్రబాబుకు కొత్త కాదు



వెంకటరాజుపాలెంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న నాగార్జున, రవిబాబు

● కార్యకర్తల సమావేశంలో నియోజవర్గ ఇన్‌చార్జి నాగార్జున ధ్వజం

మద్దిపాడు: కూటమి సీఎం చంద్రబాబునాయుడు మాటలు విని అతనికి పదవి కట్టబెడితే ఏం చేస్తాడో ప్రజలందరూ గమనించారని మాజీ మంత్రి సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మెరుగు నాగార్జున అన్నారు. మోసం చేయడం చంద్రబాబు కొత్త కాదని ప్రజలే మళ్లీమళ్లీ అతని చేతుల్లో మోసపోతున్నారని అన్నారు. గురువారం సాయంత్రం ఆయన మండలంలోని దొడ్డవరప్పాడు పంచాయతీ పరిధిలో ఉన్న వెంకటరాజుపాలెం, దొడ్డవరం, తెల్లబాడు గ్రామాల్లో కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను ఎలా మోసం చేయాలి అన్న విషయంలో చంద్రబాబు పీహెచ్‌డీ చేశాడని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు మోదీని, పవన్ కళ్యాణ్‌ను కాళ్లవేళ్లబడి కూటమిలోకి చేరిన చంద్రబాబు అసలు రూపం అందరికీ తెలిసిపోయిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ఆంధ్ర రాష్ట్ర ప్రజలను నిలువుగా ముంచేసాడని ఆయన విమర్శించారు. గత ప్రభుత్వం తమకు ఏమి చేసిందో.. ఈ ప్రభుత్వం ఏమి చేస్తుందో కూడా గమనిస్తున్నారన్నారు. మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిని ఎక్కడికక్కడ అడ్డుకుంటూ పరామర్శించేందుకు కూడా వీలు లేకుండా ఆటంకాలు కలిపిస్తున్నారని, రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని ఆయన విమర్శించారు. ఏదో ఒక రోజు ప్రజలే తిరగబడతారని ఆరోజు చంద్రబాబు దాక్కోవడానికి కూడా ఈ భూమ్మీద చోటుండదని ఆయన అన్నారు.



కార్యక్రమానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

చంద్రబాబు అంటేనే మోసం..

ఒంగోలు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు మాట్లాడుతూ లెక్కలేనని హామీలు ఇవ్వడం.. వాటిని తుంగలో తొక్కడం చంద్రబాబు నైజం అన్నారు. ప్రతి పని వెనుక స్వలాభం ఉంటుందని విమర్శించారు. భవిష్యత్‌లో టీడీపీకి మనుగడ ఉండదని.. టీడీపీని బీజేపీలో కలిపేసిన ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో వారి వెంట మండల పార్టీ ఉపాధ్యక్షుడు ఒక కోటిరెడ్డి గుట్టపాతల రవి, అన్వేష్, ఎంపీటీసీ బొమ్మల దేవదాసు సర్పంచ్ బెజవాడ రాము, పాలడుగు రాజీవ్, సన్నపురెడ్డి రవణమ్మ, పల్లకి సత్యనారాయణ రెడ్డి, వల్లంరెడ్డి బాలాంజనేయరెడ్డి, రామలింగేశ్వరరావు, నాదెండ్ల మహేష్, పణతుల పంతులు, దుద్దు వినోద్, మనం సంధ్య, రజిని, ఎంపీటీసీ మేరుగు పద్మ, సుబ్బారావు, కంకణాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ ప్రతి ఉద్యోగికి సాధారణం



ఆంగ్ల ఉపాధ్యాయుడు జిలానీ దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు



ఆనందరావు దంపతులను సత్కరిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు



కేవీ రంగారావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మద్దిపాడు: ఉద్యోగ విరమణ ప్రతి ఉద్యోగికి సాధారణమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. మండలంలోని గుండ్లాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్సు ఉపాధ్యాయుడిగా పని చేసి ఉద్యోగ విరమణ చేస్తున్న కేవీ రంగారావును హెచ్‌ఎం ప్రభాకర్ ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులు, ఎం ఈఓలు ఎంవీఆర్ ఆంజనేయులు, ఎం శ్రీనివాసరావులు ఘనంగా సత్కరించారు. ఈక్రమంలో ఆయనకు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న)ను రంగారావు దంపతులు సన్మానించి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. గురువారం ఆయన ఉద్యోగ విరమణ చేస్తున్న నేపథ్యంలో ఆయనతో పని చేసిన పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చాడని ప్రశంశించారు. సమయ పాలన, చేస్తున్న పని పట్ల ఆయనకు ఉన్న నిబద్ధత శ్లాఘనీయమని వారు పేర్కొన్నారు. కేవీ రంగారావు పని చేసిన ప్రతి పాఠశాలలో తనదైన ముద్ర వేసుకున్నరని ప్రశంసించారు. ఉపాధ్యాయుడిగానే కాకుండా ఆయన నాటక రచనలు చేసి సుమారుగా 12 సార్లు బంగారు నంది అవార్డులు గెలుచుకున్నారని తెలిపారు. ఎంఈఓలు ఎంవీఆర్ ఆంజనేయులు, ఎం శ్రీనివాసరావులు మాట్లాడుతూ రంగారావు సౌమ్యుడని ఆయన నుంచి ఎంతో నేర్చుకోవాల్సి ఉందన్నారు. అనంతరం కేవీ రంగారావు దంపతులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో రంగారావు కుటుంబ సభ్యులు, సహచరులు, బంధువులు పలువురు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు జిలానీకు వీడ్కోలు..

కొత్తపట్నం: స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న షేక్ అబ్దుల్ ఖాదర్ జిలాని బాషా ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం బస్టాండ్ సెంటర్ నుంచి భారీ ర్యాలీతో పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు సన్మాన సభకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. కార్యక్రమానికి ఇన్‌చార్జి హెచ్‌ఎం సాయికిషోర్ అధ్యక్షత వహించాడు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ వైద్యులు డాక్టర్ చాపల వంశీకృష్ణ, బెస్తవారిపేట ప్రధానోపాధ్యాయురాలు ఎం.శ్రీదేవి పాల్గొన్నారు. ఈసందర్భంగా అతిథులు మాట్లాడుతూ జిలాని పాఠశాలలో అందించిన విద్యా సేవలు ఎంతో గర్వకారణమన్నారు. అనంతరం జిలానిబాషా దంపదతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల స్టాఫ్ సెక్రెటరీ హరిబాబు, హెచ్‌ఎంలు సుబ్రహ్మణ్యం, ఎం.శ్రీదేవి, ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఆనందరావు దంపతులకు ఘన సత్కారం

సంతనూతలపాడు (చీమకుర్తిరూరల్): 40 ఏళ్లుగా విద్యుత్ శాఖలో సెక్షన్ లైన్ ఇన్‌స్పెక్టర్ పనిచేసిన పెనువర్తి ఆనందరావు సేవలు అమూల్యమైనవని విద్యుత్‌శాఖ అధికారులు పేర్కొన్నారు. సంతనూతలపాడు సెక్షన్ లైన్ ఇన్‌స్పెక్టర్ పెనువర్తి ఆనందరావు ఉద్యోగ విరమణ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఒంగోలు డివిజన్ ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మాకినేని హరిబాబు, ఒంగోలు రూరల్ ట్రాన్స్‌కో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి. శ్రీకాంత్, సంతనూతలపాడు మండల ఇన్‌చార్జి అసిస్టెంట్ ఇంజినీర్ పి. సంపత్‌కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్ సంతోష్, సబ్ ఇంజినీర్ బీవీ కృష్ణ, తదితరులు మాట్లాడారు. అనంతరం ఆనందరావు, పద్మావతి దంపతులను ఘనంగా సత్కరించారు.

క్వాంటం టెక్నాలజీతో పరిశోధనలు, ఆవిష్కరణలు

ఒంగోలు సిటీ: సరికొత్త టెక్నాలజీని అందిపుచ్చుకోవడం.. కొత్త ఆవిష్కరణలు, రీసెర్చ్ సెంటర్లను నెలకొల్పడంలో క్విస్ ఇంజినీరింగ్ కళాశాల ఎప్పుడూ ముందుంటుందని విద్యాసంస్థల అధిపతి డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి పేర్కొన్నారు. గురువారం న్యూఢిల్లీకి చెందిన 'క్వాంటం రీసెర్చ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'తో క్విస్ ఇంజినీరింగ్ కళాశాల ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్వాంటం కంప్యూటింగ్, పోస్ట్ క్వాంటం క్రిప్టోగ్రఫీ, క్వాంటం సెన్సింగ్, క్వాంటం కమ్యూనికేషన్, ఏఐ ఇంటిగ్రేషన్ తదితర అంశాల్లో సంయుక్తంగా పరిశోధన చేసేందుకు రెండు సంస్థల మధ్య ఎంవోయూ కుదుర్చుకున్నట్లు చెప్పారు. ఆరోగ్య సంరక్షణ, రవాణా, రక్షణ, సైబర్ భద్రత తదితర రంగాలు ఎదుర్కొంటున్న సవాళ్లను క్వాంటం పరిశోధనల ద్వారా పరిష్కరాలు చేసుకోవచ్చన్నారు. ఈ సెంటర్ అందుబాటులో ఉండటం వల్ల విద్యార్థులు కొత్త టెక్నాలజీలో నిష్ణాతులై క్వాంటం సైంటిస్టులుగా ఎదుగుతారన్నారు. ఎంవోయూ చేసుకోవడంపై విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీగాయత్రి ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం ఎంతగానో ఉపయోగపడుతుందని క్విస్ ఇంజనిరంగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ హనుమంతరావు అన్నారు. కార్యక్రమంలో కళాశాల గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ ప్రొఫెసర్ జాఫర్ పాల్గొన్నారు.



ఒప్పంద పత్రంతో క్విస్ సంస్థల అధిపతి సూర్యకళ్యాణ్ చక్రవర్తి

సమాచార హక్కు చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న కార్యదర్శి జ్యోతి

సంతనూతలపాడు(చీమకుర్తిరూరల్): సంతనూతలపాడు మండలం పి. గుడిపాడు గ్రామ సచివాలయంలో గురువారం సమాచార హక్కు చట్టం –2005పై అవగాహన సదస్సు నిర్వహించారు. సమాచార హక్కు చట్టంపై పీఐవో, అప్పిల్లేట్ లేటీ అథారిటీ సమాచార హక్కు చట్టంలో నిబంధనలపై సచివాలయం కార్యదర్శి జ్యోతి వివరించారు. ప్రభుత్వంపై ప్రజలకు ఈ చట్టం ద్వారా మెరుగైన అభివృద్ధికి పాలన పారదర్శకత లభిస్తుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో గుడిపాడు రెవెన్యూ అధికారి రవికుమార్, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను ప్రతిఘటించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సుబ్బారావు

చీమకుర్తి: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మీటర్లను వినియోగదారులు ప్రతిఘటించాలని సీఐటీయు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు పిలుపునిచ్చారు. గురువారం చీమకుర్తిలోని సీపీఎం కార్యాలయంలో స్మార్ట్ మీటర్లపై ప్రజాసంఘాల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటు రంగానికి కట్టబెడుతున్న కోణంలో స్మార్ట్‌మీటర్లు బిగించి దాని కయ్యే ఖర్చును కూడా అదానికి లాభాన్ని చేకూర్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పాల్పడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయటం వలన పీక్ అవర్స్ పేరుతో వినియోగదారుడికి తెలియకుండానే పలు రకాల అదనపు బిల్లులను వసూలు చేసుకునేందుకు స్మార్ట్ మీటర్లు ద్వారా దోపిడీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకున్నాయని తెలిపారు. దానిని వ్యతిరేకించేందుకు ఆగష్టు నెల 5వ తేదీన అన్ని విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయాల వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

మూడు విద్యుత్ మోటార్ల చోరీ



విద్యుత్ మోటార్లు చోరీ జరిగిన ప్రదేశం

సంతనూతలపాడు(చీమకుర్తిరూరల్): తాగునీటి కోసం ఉపయోగించే విద్యుత్ మోటార్లు చోరీకి గురయ్యాయి. మండలంలోని మద్దులూరు గ్రామం మూసీ నదిలో మూడు విద్యుత్ మోటార్లు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు గ్రామస్తులు సంతనూతలపాడు పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. గ్రామ సమీపంలోని ముసి వాగులో భగీరథ ఎత్తిపోతల పథకం కింద 2020లో రూ.7.50 లక్షలతో విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ మోటార్లతో స్థానిక చెరువులో తాగునీటి నిమిత్తం పంపింగ్ చేస్తారు. అయితే ప్రస్తుతం ఇవి వాడుకలో లేవు. గ్రామస్తులు ఈ మోటర్లు చోరీకి గురైనట్లు గురువారం ఉదయం గుర్తించారు. ఎస్సై అజయ్‌బాబు ఆదేశాల మేరకు.. ఏఎస్సై వెంకట్రావు చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు.

పోలీసు కుటుంబ సభ్యుడిలాగే చూసుకుంటాం



ఎస్సైబాషాను సత్కరించి జ్ఞాపికను అందజేస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: పోలీసు శాఖలో సుదీర్ఘకాలం విధులు నిర్వహించి రిటైర్డ్ అయిన ఉద్యోగులను ఎప్పటికీ పోలీసు కుటుంబంలో సభ్యులుగానే చూసుకుంటామని ఎస్పీ ఏఆర్ దామోదర్ చెప్పారు. దర్శి డీఎస్పీ కార్యాలయంలో ఎస్సైగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చేసిన షేక్ బాషాను గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బాషాను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సర్వీసు సమయంలో అనేక ఒడిదుడుకులను అనుభవించి, అటు ఉద్యోగ బాధ్యతలను నిర్వహిస్తునే ఇటు కుటుంబ బాధ్యతలను నెరవేర్చడం గొప్ప విషమన్నారు. రిటైర్డ్‌మెంట్ ప్రయోజనాలను సకాలంలో అందేలా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ సీతారామిరెడ్డి, ఏఆర్ ఎస్సై తిరుపతి స్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు

టంగుటూరు: విద్యార్థులు లక్ష్యాలకు అనుగుణంగా చదువుకొని ఉన్నత స్థానాలు పొందాలని ప్రధానోపాధ్యాయుడు రాంబాబు అన్నారు. మండలంలోని జమ్ములపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గడ్డం శిల్ప మెమోరియల్ ఆధ్వర్యంలో ఏడో తరగతి విద్యార్థులకు మొదటి బహుమతి సీహెచ్ లాస్య రూ. 5116, రెండో బహుమతి వర్షిణికి రూ. 2116 బహుమతి అందించారు.



నగదు బహుమతి అందజేస్తున్న హెచ్‌ఎం

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఒంగోలు డివిజన్
90102 24456, 90103 57744
90102 02762
Office mail : sakshiongads@gmail.com